ఆ రోజుల్లో రఘువచ్చాడు. వాడి రాకతో చలపతి, కేశవరావు కాలేజీకి ఎగనామం పెట్టినా గదిలోనే ఉండిపోయారు. మేమంతా పి.యు.సి. కలిసే చదువుకున్నాము. తర్వాత బి.ఎ. కు రఘు గుంటూరు వెళ్లాడు. ప్రస్తుతం బెజవాడలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. మేము మాత్రం వాల్తేరులోనే బి.ఎ. పూర్తి చేసి ఎం.ఎ.లో చేరాము.

రఘులో ఏదో ఒక వింత ఆకర్షణ ఉంది. వయస్సులో మాకన్నా పెద్దవాడు కాకపోయినా అతనిలో ఏదో పెద్దతనం గోచరిస్తుండేది. అది వయసును మించిన పరిపక్వత. మానవ మనస్తత్వాన్ని కొంతవరకు ఆకళించుకున్న వాడు కావడం మూలాన అతడు మాటలతో ఎదుటి వారి హృదయాలను కదిలించేవాడు.

రఘును తలుచుకునే సరికి ఒక సంఘటన జ్ఞాపకం వస్తుంది. ఒకసారి మేము అద్దెకుంటున్న ఇంటాయనను గురించి రఘు అన్నమాటలు: "సాధు స్వభావం మానవ మనస్తత్వంలోనే లేదు. మనుషుల్లో శాంత స్వభావులు ఉన్నారు. కానీ సాధువులు లేరు. ఈయన సాధువులాగ ప్రవర్తిస్తున్నాడు. ఇతన్ని నమ్మలేము."

కడకంతే జరిగింది. మెత్తని మాటలతో మమ్మల్ని ఆయన ముప్పుతిప్పలు పెట్టి గాని వదలలేదు.

కేశవుని అంతా 'బుద్ధిహీను' డంటారు. రఘు ఒప్పుకోడు. "తెలివి లేదుగానీ బుద్ధి ఉన్న" దంటాడు.

ఇంతటి పరిపక్వత ఆ వయస్సులో ఎలా వచ్చిందో ఎవ్వరికీ అర్థం కాదు. అందుకే అతడంటే మాకు అదో రకమైన గౌరవం.

నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కలుసుకున్నాము. అతన్నుంచి ఎన్నో విషయాలు విన వచ్చునని కుతూహల పడుతున్నామన్న మాటే గానీ, అతని వాలకం అదోలా ఉంది. మనిషి మునుపటిలా లేడు. ఉత్సాహం కనుపించటం లేదు. ముఖంలో ఏదో మార్పు వచ్చింది. ఎందుకో మానసికంగా క్రుంగిపోయినట్లు కనబడుతున్నాడు. ఆ బాధ వెనుక ఏదో గాథ ఉంటుందనిపిస్తుంది.

సాయంత్రం అందరం బీచిలో కూర్చున్నాం. రఘులోని మార్పుకు కారణం ఏమిటో అడగాలని అందరికీ ఉంది. కానీ ఎలా అడగాలో ఎవరికీ బోధ పడలేదు. ఉండబట్టలేక చలపతి అడిగేశాడు:

"ఏరా, రఘూ! ఏమైనా ప్రేమ గొడవల్లో పడి దేవదాసు లాంటి చిక్కులు తెచ్చి పెట్టుకున్నావా, ఏమిటి, ఇలా మారిపోయావు?"

"నా హృదయంలో ప్రేమ ఉద్భవిస్తుందంటే నేను నమ్మను." చిన్నగా నవ్వి అన్నాడు రఘు.

"నిరాశావాదివైనట్లున్నావు" అన్నాను నేను.

అనంతాన్ని తాకుతున్న సముద్రపు అంచులను చూస్తున్నాడు రఘు.

"జీవితంలో విపరీత సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని విధికృతంగా జరుగుతాయి. కొన్ని చేజేతులా చేసుకుంటాము. విధికృతంగా

**హితం కోరేవారికి అన్నీ కావాలి. అన్నిటా జోక్యం చేసుకోనిదే వారికి తృప్తి చేకూరదు. కనుకనే ప్రపంచంలో ఎవరూ హితైషులకు భయపడవలసినంతగా శత్రువులకు కూడా భయపడవలసిన అవసరం లేదేమో?**

జరిగిన వాటికి దైవాన్ని దూషించి తృప్తిపడతాము. కానీ తన దుఃఖానికి తానే కారణమని తెలిస్తే మానవుడు సహించలేడు" అన్నాడు.

"ఇదేదో దేవుడితోనే అభిప్రాయభేదం వచ్చినట్లుందే?" సందేహం వెలిబుచ్చాడు కేశవుడు.

"మధ్య నీదేమిటి?" గుర్రుమన్నాడు చలపతి.

"నేను గుంటూరులో ఉంటున్నప్పుడు ఒక సంఘటన జరిగింది. అది నా జీవితంలో ఒక ముద్ర వేసిపోయింది."

రఘు చెప్పటం మొదలెట్టాడు:

"శ్రీధరరావు నాకు రూము మేటుగా ఉండేవాడు. అతడు నాకంటే రెండేళ్లు చిన్న. నేను బి.ఎ. ఫైనల్‌లో ఉన్నప్పుడు అతడు పి.యు.సి.లో చేరాడు. అంత ఎత్తూ, పొట్టీ కాని విగ్రహం.

# జ్యోతిర్మయి

విశాలమైన కళ్లు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే పెదాలు. చాలా అందంగా ఉండేవాడు. అన్ని విషయాల్లో నేను చెప్పినట్లు నడుచుకుంటుండే వాడు. స్వతహాగా చాలా మితభాషి. ఎవ్వరు ఏ సలహా ఇచ్చినా కాదనేవాడు కాదు. తనకు తాను ఎవరితోనూ జోక్యం కలిగించుకునే తత్వం కాదు.

అతన్ని కాలేజీలో చేర్పించిన తర్వాత వాళ్ల నాన్న ఇంటికి వెడుతూ నాతో అన్నాడు:

'మా వాడు జాగ్రత్త, నాయనా! తెలిసీ తెలియని వయస్సులో దురలవాట్లకు లోనైతే జీవితమంతా పరితపించవలసి వస్తుంది. మంచీ, చెడూ తెలిసినవాడివి కాబట్టి నీ దగ్గర విడిచి వెళ్తున్నాను. కాస్త కనిపెట్టి ఉండు' అని.

ఈ మాటలు నాలో ఒక వింత చైతన్యాన్ని లేవదీశాయి. శ్రీధరరావును కనిపెట్టి ఉండవలసిన బాధ్యత నాదే ననుకున్నాను. నాకేదో పెద్దతనం వచ్చినట్లు అనుభూతి పొందాను. నా పెద్దరికం అతనికి నచ్చిందో లేదో తెలుసుకోవాలని కూడా అనుకోలేదు. ఈ పరివర్తన అంత

పి. ఎస్. నారాయణరెడ్డి

దుష్పరిణామాలకు దారితీస్తుందంటే దాన్ని ఆనాడే వదిలిపెట్టేవాడినేమో? కానీ అరచేతిలో నీళ్లు తలమున్కలవుతాయని ఎవరనుకుంటారు?"

రఘు దీర్ఘంగా నిశ్వాస విడిచాడు. కళ్లలో నీళ్లు తిరగటం స్పష్టంగా తెలిసిపోతూంది.

"తర్వాతేం జరిగింది? అతడు తిరుగుబాటు చేసి ఉంటాడు. అంతేనా?" అన్నాడు చలపతి.

"మా రూము కెదురుగా ఉన్న ఇంట్లో ఒక అమ్మాయి ఉండేది. ఇంకా పదహారేళ్ళుగూడ్డా నిండలేదనిపిస్తుంది. అప్పుడప్పుడే యౌవనము వయస్సుతో చెలిమి చేస్తోంది. బిందెచంకలో పెట్టుకొని ఒక వైపుకు ఒరిగి బరువుగా నడుస్తూ ఉంటే ఆ అమ్మాయిని చూడ ముచ్చటేసేది నాకు. ప్రతి దినమూ నిద్ర లేవగానే కిటికీ వైపు చూస్తుండేవాణ్ణి. ఎందుకో నాకు తెలియకుండానే నాలో ఆ అమ్మాయిని చూడాలనిపించేది. అది ఆమెలో ఆకర్షణ కావచ్చు.

ఒకనాడు సాయంత్రం అలా షికారు వెడదామని బయలుదేరాం శ్రీధరరావూ, నేనూ. దారిలో ఎదురింటి అమ్మాయి కనిపించింది.

శ్రీధరరావు నాతో మెల్లగా అన్నాడు—'జ్యోతిర్మయి చాలా అందంగా ఉంది' అని.

ఆశ్చర్యం వేసింది నాకు. 'జ్యోతిర్మయా? ఎవరా అమ్మాయి?' అన్నాను.

'మన ఎదురింటి అమ్మాయి!' అన్నాడు.

వీపున చరిచినట్లైంది నాకు. నేను చేస్తున్న పనే ఇతడు కూడా చేస్తున్నాడా? లేక నన్ను ఎత్తిపొడుస్తున్నాడా? ఏమో? ఈ మితంగా మాట్లాడే వాళ్లతో వచ్చిన చిక్కే ఇది. వాళ్లు మనసులో ఏం పెట్టుకొని మాట్లాడుతున్నారో కూడా తెలుసుకోలేం—అనిపించింది.

'ఏం? ఆ అమ్మాయిని నువ్వుగాని ప్రేమిస్తున్నావా?' అనడిగాను.

'అబ్బే! అదేం లేదు.' కాస్త తొట్రుపడ్డాడు. 'ఎందుకో ఊరికే ఆ అమ్మాయిని చూడ బుద్ధి వేస్తుంది.'

'ఇంకేం? రాగాడని జాడ్యమే వచ్చిందన్న మాట! ఇదిగో, చూడు, శ్రీధర్! తెలిసీ తెలియని వయస్సులో తప్పు చేస్తే జీవితాంతం అనుభవించవలసి వస్తుంది. జాగ్రత్త' అన్నాను నా పెద్దరికాన్ని పురస్కరించుకుంటూ.


'అంత కాని పని నేనేమి చేయటం లేదుగా?' అన్నాడు.

'కాకపోతే పెళ్లి చేసుకొని కులుకుతావా?' అన్నాను కోపం చూపిస్తూ.

'చేసుకుంటే తప్పేమిటి?' అన్నాడు.

'ఏమిటే తలదిరుగు సమాధానం' అనుకున్నాను. అతడు అలా అంటాడని నేను ఊహించలేదు. దాన్ని తెగేవరకు లాగటం మంచిది కాదని ఊరుకున్నాను. అయినా నా బాధ్యత తప్పుతున్నానేమో ననిపించింది.

అప్పటినుండి జ్యోతిర్మయిని చూడటం పూర్తిగా మానివేశాను. శ్రీధర్ మాత్రం





# జ్యోతిర్మయి

ఉదయం లేచేసరికి కొళాయివేపు చూస్తుండే వాడు. నేను చూస్తానని కూడా సందేహించేవాడు కాదు. నన్ను లెక్కచేయటం లేదేమో అనిపిస్తుండేది.

ఒకరోజు కాలేజీనుండి తిరిగి వస్తున్నాను. శ్రీధర్, జ్యోతిర్మయి ఇంటిలోనుండి రావటం చూశాను. ఆమె తలుపు దగ్గర నిల్చుని ఉంది. నన్ను చూడగానే బెదిరిపోతుం దనుకున్నాను. కాని అలాంటి దేమీ జరగలేదు.

నన్ను చూసింది. చూసి ఏమీ ఎరగనట్లు లోనికి వెళ్ళింది. అవును లే, బ్రతకనేర్చిన జాణలకు భయమెందుకుంటుంది? అనుకున్నాను. కాకపోతే మరేమిటి? చూస్తూ ఉండగానే శ్రీధర్‌ను వలలో వేసుకుంది. ఇంక ఇది ఎంతో దూరం సాగనీయ కూడ దనుకున్నాను.

రూములో కాలు పెట్టగానే అన్నాడు శ్రీధర్—'చూశావా, రఘూ! ఈ రోజు నన్ను కాఫీకి పిలిచింది జ్యోతి' అని.

'ఉహూ!'

'వెళ్ళి వచ్చాను.'

'.....'

'వాళ్ల ఇంట్లో అందరూ నన్ను ఎంత ఆదరంగా చూశా రనుకున్నావు?'

'ఇప్పుడు అలాగే చూస్తారు' అన్నాను.

'అలా కాదు, రఘూ. . .'

'నీవు ఇక్కడికి వచ్చింది చదువుకోవటానికా? ఆదరణలు పొందటానికా? ఇంతవరకు ఎలాగో ఊరుకున్నాను. ఇంత శ్రుతి మించుతుం దనుకోలేదు. ఈ సంగతులన్నీ మీ నాన్న గారికి తెలియపరచడం నా బాధ్యత.'

ఈ దెబ్బతో ఇక హడలిపోతా డనుకున్నాను.

'ఆ పని నేనే చేయా లనుకుంటున్నాను.' చాలా నిబ్బరంగా సమాధాన మిచ్చాడు.

అదిరి పడ్డాను నేను. వ్యవహారం చాలావరకు ముదిరిపోయింది. ఇక లాభం లే దనుకున్నాను. ఎలాగైనా మంచి మాటలతోనే చెప్పి చూడాలి. లేకపోతే ఉన్న గౌరవం కాస్తా పోయేలా ఉంది.

'చూడు, శ్రీధర్! నేను చెబుతున్నది నీ మంచికోసమే. జీవితం ఒక యాత్ర. మన మంతా యాత్రికులం. దారిలో ఎన్నో సుందరమైన వస్తువులు తగులుతుంటాయి. అంతమాత్రాన కనిపించిన సౌందర్య మంతా కావాలనుకోటం పొర పాటు. చూచి, ఆనందించి, వదిలివేయటం మంచిది. కానీ మొయ్యలేని భారాన్ని మూపున వేసుకుంటే గమ్యస్థానం చేరటం కష్టం.' స్వంత వేదాంతం వల్లించాను.

శ్రీధర్ విన్నాడు. విని తల ఊపాడు. మరి మాట్లాడలేదు. ఒప్పుకుంటున్నాడో, తప్పు కుంటున్నాడో అర్థం కాలేదు.

ఇంక ఆ రూము వదిలి వెళ్లటం మంచి దని

పించింది. కానీ ఎలాగా? అతను ఒప్పుకుంటాడా? 'కావాలంటే నీవు వెళ్ళు. నేను రాను పొమ్మంటే ఏమిటి చేయడం? ఉన్న మర్యాద కాస్తా ఊడదూ?

ఖడకు ఎలాగైతే నేమి సమయం కలిసివచ్చింది. ఓ రోజు ఇంటాయన వచ్చి తన ఇంట్లో సత్యనారాయణ వ్రతం జరుగుతోంది, బంధువులొస్తున్నారు, రెండు రోజులు గది ఖాళీ చేయమన్నాడు. ఇంక ఈ సమయం జారవిడుచుకోకూడదనుకున్నాను.

'గది ఖాళీ చేసి ఎక్కడికి వెళ్ళాలి?' అన్నాను.

'ఎక్కడైనా మీ స్నేహితుల గదుల్లో రెండు రోజులెలాగో ఉండండి' అన్నాడు, మేమెక్కడుంటామో తన కేమీ సంబంధం లేనట్టు.

శ్రీధర్ ఏదో సర్ది చెప్పటానికి ముందుకు వచ్చాడు. కానీ నే నతనికి అవకాశ మివ్వలేదు.

'గది వదలడానికి వీల్లేదండి' అన్నాను, మేము బాడుగ ఇవ్వలేదా అన్న అధికారం ధ్వనించేలాగా.

'ఏమండీ, మీ బాడుగ కావలిస్తే ఇప్పుడే ఇచ్చేస్తాను. గది వెంటనే ఖాళీ చెయ్యండి. మమ్మల్ని శత్రువేయని వాళ్ళు మా గదిలో అక్కరలేదు' అన్నాడు ఖచ్చితంగా.

'ఏమండీ! ఏమండీ!' శ్రీధర్ ఏదో చెప్ప బోయాడు.

'ఏమీ లేదు. మీరు వెంటనే ఖాళీ చేయండి' అంటూ వెళ్ళిపోయాడు.

ఈ విపరీత పరిణామాన్ని శ్రీధర్ వెంటనే అవగాహన చేసుకోలేకపోయాడు. ఆశ్చర్యం అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది.

ఎలాగో బ్రాడీపేటలో ఒక మేడమీద గది దొరికించుకున్నాము. అద్దె కొంచెం ఎక్కువ అయితే అయింది, అన్నీ సదుపాయాలూ ఉన్నాయి. ఎట్టకేలకు నా మనసులో భారం చాలవరకు తగ్గింది. ప్రేమను విడిచి వచ్చిన రూము ఇక్కడికి క్రోసెడు ఒకటిన్నరమైలైనా ఉంటుంది. విష వృక్షాన్ని మొలకగా ఉన్నప్పుడే త్రుంచివేశాను లెమ్మని తృప్తిచెందాను.

రోజులు, వారాలు గడిచి పోతున్నాయి. స్మృతి పథంలో, జరిగిన సంఘటనలు మసక పడుతున్నాయి.

• • •

ఆ రోజు సాయంత్రం ఒంటరిగా వరండాలో కుర్చీ వేసుక్కూర్చున్నాను. క్రితం రోజు జరిగిన విపరీతం మదిలో మెదులాడుతూంది.

నిజంగా శారద చావు చాలా శోచనీయమైనది. మానవ జీవితం బుద్బుదప్రాయమని రుజువు చేస్తుంది ఆమె మరణం. శారద మా క్లాసు మేటు. ఆ నాడు రాత్రి ఎనిమిది గంటల వేళ కాలేజీలో ఫిలిమ్ షో ముగిసింది. అంతా తిరుగు ముఖాలు పట్టాము. గేటు దాటుతూ ఉన్నాము. ఇంతలో విద్యార్థినుల గుంపులో కలకలం బయలు దేరింది. ఏమిటోనని అంతా అటువెళ్ళాము. శారద నేల మీద పడివుంది. కొందరు ఏవో ఉపచర్యలు చేస్తున్నారు. ఏమి జరిగిందని అడిగాము. అంతా వెల్ల ముఖాలు వేశారు.




మెక్లీన్స్ టూత్‌పేస్ట్ యొక్క తాజాయైన,
ఆశ్చర్యకరమైన రుచి అది యీ క్రింది విధముగా
పనిచేస్తోందనుటకు నిదర్శనము !

శుభ్రపరుస్తుంది – పళ్లమీది పసుపుపచ్చని పొరను తీసివేస్తుంది

తెల్లగాచేస్తుంది – పళ్లను ఎక్కువ తెల్లగా చేస్తుంది

రక్షణకలిగిస్తుంది – కుళ్లేలా చేసే సూక్ష్మక్రిములను తొలగిస్తుంది.
మీ నోటిని సువాసనతో శుభ్రముగా ఉంచుతుంది.




మెక్లీన్స్ - మెరిసే తెల్లని పళ్లకు

MTP/11/P/1165/TU

# జ్యోతిర్మయి

'ఏమీలేదు. నడుస్తూ నడుస్తూ పడిపోయింది.' ఒక అమ్మాయి జవాబిచ్చింది.

'వాడి ఆడటం లేదు.' ఇంకొక అమ్మాయి గొల్లు మంది.

హాస్పిటలుకు తీసికొని వెళ్లాము. డాక్టరు ... మరణ కారణం కూడా వివరించలేకపోయాడు. కన్య ప్రాయంలో సంభవించే ఒక విధమైన జబ్బు అన్నాడు. కానీ ఆత్మహత్య మాత్రం కాదని నిర్ధారణగా తెల్పాడు.

టేబిల్‌మీద శారద శరీరం చిత్రపటంలా ఉంది. ముఖంలో జీవకళ కొంచెమైనా తరిగిపో లేదు. మృత్యుదేవతా ముద్రలు ఆ శరీరం మీద ఎక్కడా లేవు. ఆమె ఇప్పుడు శవం. మనసులో నమ్మకం తగలకుండా ఉంది. కానీ ఆమె ఇప్పుడు శవం.

ఎవరో వస్తున్నట్లు శబ్దమైంది. చూశాము. జోతిర్మయి.

కస్సుమంది మనస్సు.

'శ్రీధరరావుగా రున్నారాండి?' జంకుతూనే అడిగింది.

'ఎందుకండీ?' కొంచెం వెటకారంగా అడిగాను.

'ఎబ్బే! ఏమీలేదు. ఏమీలేదు. వెళతాను.' వెళ్ల బోయింది.

నాలోని క్రౌర్యం మేలుకొంది. 'ఏమండీ! వెళ్ళటమే కాదు. ఇంక తిరిగి రాకుండా ఉండాలి. ఇకమీదట అతనికీ మీకూ ఏ సంబంధమూ లేదు.'

జ్యోతిర్మయి మారు పలకకుండా వెళ్లింది. హృదయంలో ఒక మూలన కరుణ మూలిగింది. ఏదో తప్పు చేసినట్లు అనుభూతి పొందాను. కానీ ఇందులో స్వార్థ మేముంది?

అనవసరంగా ఆమె హృదయం నొప్పించానేమో ననిపించింది. మనసుకు ఎంత గాయం తగిలి ఉంటుందో! ఆమెను ఆ విధంగా బాధించడానికి నాకే మధికారముంది? 'నీ వెవరివి మధ్యలో?' అని వుంటే ఏమని సమాధానం చెప్పగలిగేవాడివి? జోతిర్మయి అన్నీ సహించి వెళ్లింది. కొందరి హృదయాల్లో గాయాలకు ... గూడు కట్టుతుంది. వెలికి చిమ్మదు ... ధర్ వచ్చాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు ... ్మయి కనిపించిఉంటుందేమోననుకున్నాను.

రఘూ! జ్యోతి ఇక్కడికి వచ్చింది. నీవు చూడలేదా? అవునులే, నీ వెక్కడచూస్తావు? బయటి ప్రపంచాన్ని మరిచి నీ ఆలోచనలలో నీవు మునిగి వుంటావెప్పుడూ' అన్నాడు.

అయితే ఇక్కడ జరిగిన విషయం ఇతనికి తెలియదా? అనుకున్నాను.

'ఈ రోజు శనివారం కదూ? గుడికి వెళ్ళి వచ్చిందట. ప్రసాదం తీసుకొని వచ్చింది. నీవు సమాధిలో వుండి పిలిచినా పలికివుండవు...'

'ఉహూ!' అన్నాను, ఏమి చెప్పాలో తోచక.

'తిరిగి వెళ్ళిపోతూ నాకు కనబడింది. ఇదిగో, ప్రసాదం. మీకు ఇవ్వమంది.' గుండెలో బాకు దూరినట్లైంది.

• • •

ఒక వారం గడిచింది. ఆ రోజు శ్రీధర్ ఎక్కడో బయటికి వెళ్ళాడు. నేను చాకలికి గుడ్డలు వేస్తున్నాను. అతని చొక్కాలో ఏదో కాగితం ఉందని చాకలి నా చేతికిచ్చాడు. అనాలోచితంగానే తీసి చూశాను.

అది ఒక ఉత్తరం. సుందరమైన అక్షరాలు విడివిడిగా వ్రాయబడి ఉన్నాయి. జ్యోతిర్మయి వ్రాసినదే. చదవకుండా ఉండలేకపోయాను.

'శ్రీ రావు గారికి,

మనం ప్రేమించుకున్న మాట నిజమే. కాని మీరు ప్రతిదినం మా వీధిలో తిరగడం ఇతరులకు అనుమానాస్పదమవుతూంది. దీనికి సంఘాన్ని నిందించడంకన్న, దానికి అనుగుణంగా నడుచుకోవడం మంచిది.

మీరు నన్ను వివాహం చేసుకుంటానన్నారు. నాకుమాత్రం అంతకన్న కావలసింది ఏముంది? వీలైనంత త్వరగా మీరు మా నాన్నగారిని కలుసుకొని మాట్లాడటం మంచిది. వరకట్నాల ఊసెత్తితే తల పట్టుకునే మా నాన్న మీ ఉద్దేశ్యము వింటే కాదనడనుకొంటాను.

మీరు మానసికాందోళన భరించలేకున్నానని చెబుతూ ఉంటారు. హృదయకల్లోలం నాకు మాత్రం లేదా? ఇది మన పరిస్థితుల్లో ఉన్న వారందరికీ సహజమే. దుమ్ము లేవక మునుపే నీరు చల్లడం మంచిది. మీరు వెంటనే మా నాన్నను కలుసుకుంటే ఈ సంఘంతో ఆటంకం తీరిపోతుంది. రండి, రేపు సాయంత్రం వేచి ఉంటాను. వస్తారు గా?

మీ,
జ్యోతి.'

ఉత్తరం చదివాక నాలోకి ఏదో కొత్తదనం ప్రవేశించినట్లైంది. అయితే వీరిది మామూలు ప్రేమ కాదా? ప్రేమ అనగానే సినిమాలూ, షికార్లూ, బీచ్‌లూ గుర్తుకు వస్తాయి. యువతీ యువకులు ప్రేమించుకున్నామని తెలియగానే వీటిలోకి దూసుకు పోతారు ప్రపంచాన్ని మరిచి.

కాని వీరి ప్రేమకు వీటితో ప్రమేయం ఉన్నట్లు లేదు. వీరు ప్రపంచంలో ఉన్నారు. ప్రపంచపు కట్టుబాట్లను అధిగమించే దుందుడుకుతనం లేకుండా ప్రేమయాత్ర సాగిస్తున్నారు. నిజమైన ప్రేమంటే ఇదే కాబోలు!

ముఖ్యంగా ఆమె నిండుదనం, నిబ్బరం నన్నాశ్చర్య పరిచాయి. 'అవును, ఆమె నిశ్చల జలాశయం లాంటిది' అంది నా మనస్సు. చలనంలేని ఆమె హృదయంలో, ఆ నిశ్చల స్ఫటిక జలాశయంలో శ్రీధర్ తన రూపాన్ని చూసుకుంటున్నాడు. ఆ ప్రతిబింబంలో లీనమయ్యాడు. ఈ ప్రపంచాన్ని మరిచిపోయాడు....

'అయ్యగారూ, బట్టలు రాసుకోండి' అన్నాడు

(తరువాయి 63 వ పేజీలో)





● రాగి అడుగు భాగముంతో ఆహారము కాలిపోదు, మాడిపోదు.
● అవి వేడిని సమముగా ఎక్కేలా చేస్తాయి.
● వాటిని శుభ్రపరచుట, శుభ్రముగా ఉంచుట సులభము...కడిగి తుడిచివేస్తే చాలును!

రాగి అడుగు భాగములుగల స్టైయిన్ లెస్ స్టీల్ పాత్రలు వంటకు అత్యుత్తమమైనవి. అంతేకాక అవి ఒక జీవితకాలం మన్నుతాయి. వాటిని నేడే కొనండి. వాటితో వండడము సరదాగా వుంటుంది.... శుభ్రము చేయడము ఎంతో తేలిక !
అవి మీ దగ్గరలో లభించకపోతే ఉత్పత్తిదార్ల ప్రతినిధికి వ్రాయండి.

మహాలక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్
192 బి, పంజారపోల్ రోడ్, బొంబాయి-4
ఈ ట్రేడ్ మార్క్ కోసం చూడండి Meghdoot

LPE Aiyers I 3 TEL

# జ్యోతిర్మయి

(21 వ పేజీ తరువాయి)

చాకలి దగ్గరగా. ఒక్క ఊపులో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను.

* * * *

'అయితే, శ్రీధర్! నీవు జ్యోతిర్మయి నాన్న గారితో మాట్లాడావా?' అన్నాను అతడు రూములో కాలు పెట్టగానే.

'ఇంకా లేదు. రేపు సాయంత్రం రమ్మని చెప్పింది' అన్నాడు, ఏలాటి అభ్యర్థ భావం లేకుండా. ఈ విషయం నీకెట్లా తెలిసింది అని అనుకుంటున్నాడు.

'మరి వెడతావా?' అన్నాను కుతూహలం చంపుకోలేక.

'అదే ఆలోచిస్తున్నాను' అన్నాడు ముక్తసరిగా.

ఆలోచించకపోతే మన్ని నుంచి అవకాశ్యమా? నే నిప్పుడు ఇంతకుముందులా లేనా? అనుకున్నాను.

'ఇంతగా మాట్లాడా లనుకున్నావు? ఆహా! ప్రపంచం ఎట్లా సాధించాలని నిశ్చయించు కున్నావు?' అన్నాను, మాటల్లోకి దింపి నా మంచితనం రుజువు చేసుకుందామని. అవసరమైతే కొన్ని ఉచిత సలహాలు కూడా ఇద్దామని.

అతడు పలకలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. మళ్ళీ నేనే అన్నాను :

'అదిరాదు నేస్తం. ఇది పెద్దలతో పని. కొంచెం మెరా ముందుగా చూసి మరీ దిగాలి రంగంలోకి. లేకపోతే పీకమీదికి వస్తుంది.' నాలాంటివారి సలహాలు తీసుకోవడం మంచిదనే అర్థం స్ఫురించేట్టు అన్నాను.

అతడు పలకలేదు. సైకిలు తాళం చెవి చేతిలోకి తీసుకున్నాడు. బయటికి వెడుతున్నాడేమో?

'ఆయనతో ఒక్కడవే మాట్లాడగలవా?' అన్నాను, వస్తా రమ్మంటాడేమో సహాయానికనుకొని.

తలుపు దగ్గరికి వెళ్ళి చెప్పులు వేసుకుంటున్నాడు.

'ఈ సంగతులు మీ నాన్నగారికి తెలియ బరిచావా?' అన్నా కనీసం వాళ్ళ నాన్న పేరు చెబితేనన్నా ఈ లోకంలో పడతాడని.

కాని అతడేమీ జవాబీయకుండా మెట్లు దిగి వెళ్ళుతున్నాడు.

తొందరగా వెళ్ళి చేయి పట్టుకొని నిల బెట్టాను. సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అడిగాను :

'ఇప్పు డక్కడికేనా వెళ్ళటం?'

'లే'దని తల అడ్డంగా తిప్పి ముందుకు సాగాడు. అతన్నింక వారించలేకపోయాను.

తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నానన్న మాటే గాని మనసు మనసులో లేదు. ఇతడు ముభావంగా ఉండటానికి అర్థమేమిటి? ఆరోజు నేను జ్యోతిర్మయిపై చిరాకు పడిన సంగతి ఏమైనా తెలిసిందా? అబ్బే! ఆమె చెప్పకపోతే ఆ సంగతి తెలిసేదానికి అవకాశం లేదు. లేకపోతే వాళ్ళ నాన్నగారికి సంగతి తెలిసి....అబ్బే! అనుకోవటానికి వీల్లేదు. ఆయన కీ సంగతి తెలిసి ఉంటే ముగ్గుర మీసాలు తిప్పుతూ ఈపాటికి ఇక్కడికి వచ్చి వాలేవారు.

లేక నే నడిగిన ప్రశ్నలయినట్టి వాళ్ళ నాన్నకు తెలియజేయడానికి కాపీ లాగుతున్నా ననుకో లేదుగదా? భగవాన్! నా ఉద్దేశ్యం అది కాదని అతడు తెలుసుకోలేడా? అథవా కంఠస్వరాన్ని బట్టి అయినా నా హృదయాన్ని అర్థం చేసుకో లేకపోయాడా? పోనీలే, అంత కావాలని అపార్థం చేసుకునేవాళ్ళను మనమేం చేయగలము?

అవును, నిజం. కావాలని అపార్థం చేసుకునే వాళ్ళ కోసరే చెందుతాడు శ్రీధర్. కాకపోతే ఏ లేమిటి? హృదయపూర్వకంగా సహాయం చేస్తానంటే సుముఖంగా వెడతాడా? కనీసం మాటకు మాట బదులు చెప్పలేడా? పిలిచినా పలక్కుండా వెళ్ళిపోతే నాకెంత అవమానకరంగా ఉంటుందో అనూత్రం ఊహించలేడా?

లేదు. ఇది చెయ్యాలని ఉద్దేశపూర్వకంగా చేసినదే. హృదయంలో ఎంత ద్వేషం పెట్టుకొని ఉండనిది ఇంత అవమానం చేయడం సాధ్యమవు తుంది? నేనేం చేశానని అతని కింత బిగువూనం? కొద్దిరోజులనుండి అతని గొడుగు పట్టించు కోవటం మానివేశానుగా? అవసరం కాకపోతే లేనిపోని ఈ బిగువూనా లెందుకు? అయినా అతడంత బింకంగా ఉంటే బొట్టు కాటుక పెట్టుకొని వెళ్ళి పలకరించవలసిన అవస్యం నాకేమొచ్చింది? ఇటువంటివాళ్ళు పలక్కపోతే నాకునష్టం జరిగేదేమిటి?

దాదా మెట్లు దిమ్మను అవుతున్నాయి. శ్రీధరావే కాబోలు వస్తున్నాడు. రానివ్వు. నేను కూడా సుముఖం పెట్టకూర్చుం టాను. పౌరుషం తనకేనాదు, నాకు కూడా ఉందని తెలియజేయాలి. అరే! చప్పుడు మధ్యలోనే ఆగిపోయిందేమిటి? ఆగిపోయా డెందుకో?

'రావుగారూ!' వీణలాగ మ్రోగింది జ్యోతిర్మయి కంఠం.

వెళ్ళి చూచాను. అప్పుడే అలుముకొంటున్న చీకట్లలో, సగం ఎక్కిన మెట్లమీద నిలబడి ఉంది. బుట్టను పడగ విప్పింది సొగసు.

'ఒక మాటిలా రండి' అన్నాను.

వచ్చింది టిక్కు టిక్కుమంటూనే.

'ఎందుకు వచ్చారు?' అన్నాను కర్కశంగా.

'రావుగారు...రావుగారు....ప్రసాదం.' అనునయంగా చూసింది.

'మీ ప్రసాదమక్కరలేదు. మీరూ అక్కర లేదు. మీ కార్యకలాపాలేమైనా ఉంటే బయట చూచుకోవచ్చుగా? మధ్య నన్నెందుకు బజా ర్కెక్కించటము?'



పూల రెమ్మ

కత్తిరింపు చిత్రం — కోరా సీతామహాలక్ష్మి (కోమూరు)

ఆమె మెల్లగా వచ్చింది. వణుకుతున్న చేతిలోని ప్రసాదం క్రిందపడింది. ఆమె వడివడి పోయింది. మెట్లలో దొర్లుతున్న గుగ్గిళ్ళు తెల్లగా నవ్వుతున్నాయి.

ఏదో తప్పుచేశాననిపించింది. బాధగా మూలిగింది మనస్సు. వెనక్కి పిలిచి క్షమాపణ చెప్పు కుందామనిపించింది. కాని ఆ పని చేయలేక పోయాను.

రూములోకి వెళ్ళి కూర్చున్నాను. అంధకారం అలుముకుంటూంది. హృదయంలో ఏదో అగాధం ఏర్పడింది. ఛీ! నేను కిరాతుణ్ని. ఆమె హృదయం గాయపరిచాను. నిష్కల్మష మైన ఆమె కంఠంలో కల్లోలం లేదు. ఆమె నాకేమైనా ద్రోహం చేసి ఎరుగునా? ఆమె నెందుకింతగా బాధించాను? ఛీ ఛీ! నేను మనిషిని కానేమో?

'రఘూ!' శ్రీధరరావు కంఠం ఖంగుమంది.

'ఏమిటి? ఏమిటి?' అన్నాను కంగారుగా.

'లైటులేకుండా చీకట్లో కూర్చున్నావేమిటి?'

'ఆ...ఆ...కూర్చున్నాను' అన్నాను తమా యించుకుంటూ.

శ్రీధరరావు లైటువేశాడు.

'నేనిప్పు డొక నిర్ణయానికి వచ్చాను' అన్నాడు ఎదురుగా కూర్చుంటూ.

'ఏమిటది?' అడక్కుండా ఉండలేకపోయాను.

'రేపు మానాన్న వస్తాడు.'

'ఊఁ?'




శ్రీ బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీ మహా భాగవతము

(పద్యకావ్యము) పరిష్కర్త, లఘు టీకాకారులు, శ్రీ బులుసు వెంకటరమణయ్యగారు ఆంధ్ర మహాజనుల అల్లారుముద్దు ప్రబంధమైన ఈ సద్గ్రంథమును గొప్ప పండితులచే పరిష్కరింపజేసి — అందమైన 25 చిత్రములనుజేర్చి, ముద్రింపించి—ప్రచురించియున్నాము. రాయల్ 1/8 సైజు— పూర్తి వాల్యూం రు. 19—1, 2 భాగములు విడివిడిగా రు. 10/- పోస్టేజి ప్రత్యేకం.

బాలసరస్వతి బుక్ డిపో, మదరాసు—1.

SWASTIK





# జ్యోతిర్మయి

'ఆయన్ని ఒప్పించే బాధ్యత నీదే.'

'దేనికి?'

'దేనికేమిటి? నా పెళ్లికి.'

'ఆయన ఒప్పుకోకపోతే?'

'ఒప్పుకోకపోయినా పెళ్లి ఆగదు.'

'జ్యోతిర్మయి తండ్రి ఒప్పుకున్నాడా?'

'నే నింకా ఆయన్ని చూడలేదు. కాని ఆయన తప్పకుండా ఒప్పుకుంటాడు. మా నాన్నను ఒప్పించే పూచీమాత్రం నీది.'

'ఆయన నసేమిరా అంటే?'

'అంటే నాకు ఉద్యోగం చూచిపెట్టే బాధ్యత కూడా నీదే.'

'ఉద్యోగమా?'

'అవును, మరి పొట్టగడవటానికి.'

'నేను చూచిపెట్టాలా?'

'నీవు తప్ప నాకింకెవ్వరున్నారు?'

నాకు కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. అమాంతం శ్రీధర్‌ను కౌగిలించుకొని ఏడవాలనిపించింది. అతన్ని ఎంత అపార్థం చేసుకున్నాను! దూషించాను. ద్వేషించాను. కొంత ద్రోహం కూడా చేశానేమో? పోనీ, ఆ సంగతి ఇతనితో చెప్పి క్షమాపణ వేడుకుంటే?...వద్దు, వద్దు. అదంతా తెలిస్తే నన్నింతగా గౌరవిస్తాడా? తెల్లవారితే వాటంతటవే అన్నీ సర్దుకుంటాయి. భగవాన్, నేను చేసిన పనికి ఫలితాలు ఈ చీకటి దాటకుండా చూడు! నేను పూర్తిగా అశక్తుణ్ణి. పూర్తిగా అశక్తుణ్ణి. ఫరవాలేదు. భగవంతుడు ఉన్నాడు. తెల్లవారితే అన్నీ సర్దుకుంటాయి. అన్నీ సర్దుకుంటాయి.

* * * *

ఉదయం నాకన్నా ముందు లేచాడు శ్రీధర్. నేను లేచేసరికి స్నానం ముగించుకు వచ్చాడు. బయటికి వెళ్లడానికి గుడ్డలు వేసుకుంటున్నాడు.

'కాఫీకి వెళ్తున్నావా?' అన్నాను.

'ఆ. అలాగే జ్యోతిర్మయిని చూసి మాట్లాడి వద్దామని.'

'ఎందుకిప్పుడు కలుసుకోవటం?' ఏదో అనుమానం పీకుతూంది.

'అహఁ. ఏమీ లేదు. నిన్నటిదినమంతా కలుసుకోలేకపోయాను. ఈరోజు మానాన్న వస్తున్నాడని తెలియజేసి వస్తాను.' 'అవును. మెయిల్లో వస్తున్నాడు. నేను వచ్చేసరికి తయారుగా ఉండు. స్టేషన్‌కి వెళ్లి ఆయన్ని పిలుచుకొనివద్దాము.'

'వచ్చి....?'


'వచ్చి జ్యోతిర్మయి నాన్నగారిని కలుసుకుందాము.'

'కలుసుకొని?'

'మాట్లాడుదాము.'

'మాట్లాడి?'

'మాట్లాడి పెళ్లి చేసుకుందాము.'



వరద తగ్గిన తర్వాత....

చిత్రం — ఎస్. విఠల్‌రావు, బెంగుళూరు.9

అడిగివచ్చాను. 'ఎవర్ని? జ్యోతిర్మయి నాన్న గారినా?'

పక్కనే నవ్వాడు, చెప్పులు వేసుకుంటూ. 'చూస్తావుగా?' అంటూ బయటికి నడిచాడు.

శ్రీధర్ వెళ్ళినప్పటినుండి మనసులో ఏదో పీకుతూనే ఉంది. బహుశా అతడు వెళ్ళడం నాకిష్టంలేకనేమో? ఏదో అసంతృప్తిగా ఉంది. జ్యోతిర్మయి అతనితో ఏం చెబుతుందో? మా మధ్య ఆత్మీయత ఇంతటితో ఏటాపంచలు కాదుగదా?

అయినా నేనేం చేశాను? వాళ్ళ బాగుకోరి ఏదో అన్నానంతే గాని ఇందులో నా స్వార్థమేముంది? ఏంతయినా వాళ్ళ నాన్నగారికి అన్నీ నచ్చి చెప్పవలసినవాణ్ణి నేనేగదా? అవును. వాళ్ళ నాన్నగారికి నచ్చజెప్పాలి. ఆయన్ను ఎలాగైనా ఒప్పుకునేలాగ చేయాలి. శ్రీధర్‌కు ఏ ఆటంకమూ లేకుండా చేయాలి. అతడి జీవితం సుఖమయం కావడానికి తోడ్పడాలి. అప్పుడు గానీ నేను చేసిన ద్రోహానికి నిష్కృతి లేదు. అన్నిటికీ ముఖ్యం వాళ్ళ నాన్నని ఈ పెళ్ళికి ఒప్పించడము. ఒప్పిస్తాను. ఆయన్ను ఆకర్షించడ మెలాగో నాకు తెలుసు. ముందు స్టేషన్‌కు వెళ్ళి ఆయన్ని కలుసుకోవాలి.

త్వరగా వెళ్ళి స్నానం చేసివచ్చాను. డ్రెస్ వేసుకుంటున్నాను. మెట్లు శబ్దమవుతున్నాయి. శ్రీధర్ కాబోలు వస్తున్నాడు.

అరె! అదేమిటి, అడుగులు అంత బరువుగా పడుతున్నాయి? ఎవరో శరీరాన్ని మొయ్యలేక మొయ్యలేక మోసుకొస్తున్నట్టున్నారు. ఇంకెవరు? శ్రీధరే. అలా ఉందేమిటి అతని వాలకం?

'ఏం జరిగింది? ఎందుకలా ఉన్నావు?' అనడిగాను ఆదుర్దాగా.

'జ్యోతిర్మయి చనిపోయింది.'

'ఆఁ...ఆఁ...ఏమిటి?'

'జ్యోతిర్మయి....'

'ఊఁ. జ్యోతిర్మయి?'

'...చనిపోయింది.'

'ఎందుకు? ఎందుకు? ఎందుకూ?...'

'చనిపోయింది.'

'ఎందుకు? ఎందుకూ?'

'రాత్రి...పోయింది ' గొల్లుమన్నాడు.

నాకు కళ్ళు తిర్గినట్టయ్యాయి. పిచ్చిగా పరుగెత్తాను జ్యోతిర్మయి ఇంటివేపు. ఆ యింటి ముందు జనం గుంపుగా ఉన్నారు.

'ఏం జరిగింది? ఏం జరిగింది?' అన్నాను. మా పాత రూము యజమాని ముందుకువచ్చాడు.

'ఎవరూ? ఓహో! మీరా? వాళ్ళ అమ్మాయి ఉండేది చూశారూ....జ్యోతిర్మయి?'

'ఆఁ...ఊఁ?'

'ఆ అమ్మాయి చనిపోయింది.'

'ఎందుకు? ఎందుకూ?'

'ఎందుకేమిటి? ఎట్లా చనిపోయిందంటారా? ఆ భగవంతునికే తెలియాలి. రాత్రి భోజనంచేసి పడుకుంది. తెల్లవారేసరికి ఈ ఘోరం జరిగిపోయింది.'

శవాన్ని బయటికి మోసుకు వచ్చారు. నిన్నటి వరకు ఆమె సజీవి. నేడు శవం. అబ్బ! ఎంత మార్పు! భగవాన్, ఆత్మహత్య కాదుగదా? ఆమె ముఖంలో మృత్యు దేవతా ముద్రలు లేనేలేవు. జీవకళ కొట్టవచ్చినట్టు కనపడుతూంది. ముంగురులైనా చెదిరిపోలేదు. ఇది శారదలాంటి చావేనేమో? కావచ్చు. కావచ్చు. అంతే అయి ఉంటుంది. ఆత్మహత్య కాదు. స్పష్టంగా కనపడుతూంది ముఖంలో కళ. ఖచ్చితంగా ఇది శారదలాంటి చావే అయి ఉండాలి. భగవాన్, ఇందులో నా పాపం లేదుగదా? లేదు, లేదు. ఖండితంగా ఇది ఆత్మహత్య కాదు. ఇందులో నాకేమీ సంబంధం లేదు.

అబ్బ! మదిలో ఏదో మెదులాడుతూంది. బాధగా ఉంది. భగవాన్, ఇది ఆత్మహత్య కాకపోతే చాలు."

చెప్పటం చాలించాడు రఘు. అప్పుడప్పుడే చీకట్లు అలుముకుంటున్నాయి. వరిచేలలో కప్పలు అరుస్తున్నాయి. కీచురాళ్ళు చేసే రొద భయాన్ని తోడుతూంది. మెల్లగా ఊరివైపు నడక సాగించాము. మా అందరి హృదయాలూ బరువుగా ఉన్నాయి.

"ఇంతకూ అది ఆత్మహత్యేనా?" అడిగాను కేశవుడు.

పలకలేదు రఘు. దీర్ఘంగా నిట్టూర్చాడు.

"తర్వాత శ్రీధరరావు ఏమయ్యాడు?" అన్నాడు చలపతి.

"వాళ్ళ నాన్న అతన్ని ఇంటికి తీసుకొని వెళ్ళాడు."

"ఇంతకూ అది...." మధ్యలోనే వారించాను కేశవరావును. ★